అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 146. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.18.02.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు..

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: సరైన పత్రాలు లేని వలసదారుల్ని స్వదేశం తిప్పి పంపు తున్న అమెరికా వారిపై అమానవీ యంగా ప్రవర్తించడం మానడం లేదు. ఎన్ని విమర్శలు, ఆందోళనలు వస్తున్నా అమెరికా ప్రభుత్వం మాత్రం వలస దారుల్ని సంకెళ్లతోనే బంధించి సైనిక విమానాల్లో తరలిస్తోంది. ఈ విషయాన్ని స్వదేశం చేరకున్న భారత వలస దారులు స్వయంగా తెలిపారు. 'డిపోర్టేషన్'లో భాగంగా 116 మంది భారతీ యులతో కూడిన రెండో విమానం శనివారం రాత్రి అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇందులో హొషియార్‌పుర్ జిల్లా కురలా కలాన్‌కు చెందిన దిల్జిత్ సింగ్ అనే వ్యక్తి.. అమెరికా ప్రయాణం గురించి మీడియాతో మాట్లాడాడు. తిరిగి వచ్చే సమయంలో అమెరికా అధికారులు వ్యవహరించిన తీరును వివరించాడు. కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు వేశారని తెలిపారు. విమానం అమృత్‌సర్‌లో ల్యాండ్ అయ్యే ముందు సంకెళ్లను తొలగించారని అని దిల్జిత్ సింగ్ పేర్కొన్నారు. మహిళలకు మాత్రం సంకెళ్లు వేయలేదని తెలిపారు.

## ఏపీలో జీబీఎస్ ప్రమాద ఘంటికలు..

గుంటూరు:అమృత్ తెలంగాణ: ప్రకాశం జిల్లా అలసందలపల్లికి చెందిన కమలమ్మ గులియన్-బారీ సిండ్రోమ్ (జీబీఎస్)తో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తీవ్ర జ్వరం, కాళ్లు చచ్చుపడి పోవడంతో కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బాధితురాలు ఆదివారం కన్నుమూసింది. కమలమ్మ మృతిని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి ధ్రువీకరించారు .అరుదుగా లక్షమందిలో ఒకరిద్దరికే వచ్చే జీబీఎస్ అనే నరాల సంబంధిత వ్యాధి కేసులు ఏపీలో ఇటీవల ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరు ప్రభుత్వాస్పత్రికి (జీజీహెచ్) ఈ నెల 11న ఒక్కరోజే ఏడు కేసులు వచ్చాయి. ఏలూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి నలుగురు, గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముగ్గురు ఈ వ్యాధి లక్షణాలతో ఆస్పత్రిలో చేరారు. వారిలో ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. అదే వ్యాధితో కాకినాడలో ఇటీవల ఇద్దరు చేరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఈ వ్యాధితో 17 మంది చికిత్స పొందుతున్నారు.

# రాజ్యాంగేతర చర్యలను సాగనివ్వం

**రంగరాజన్‌పై మతోన్మాద మూక దాడి దుర్మార్గం**
**రామరాజ్యం అంటే హింసాత్మక దాడులా?**
**త్రిశూల్ పేరుతో యువతరం చేతుల్లో మారణాయుధాలు**
**జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి**
**అసమానతలపై ధర్మపోరాటం చేయాలి**
**అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి**
**మతోన్మాదుల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాలి : కేవీపీఎస్**
**రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నేతలు**



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాజ్యాంగేతర చర్యలు ప్రజాస్వామిక సమాజానికి విఘాతమనీ, వాటిని ఎట్టి పరిస్థితుల్లో సాగనివ్వబోమని వక్తలు హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్య స్థాపన ఆర్మీ పేరిట వీర రాఘవరెడ్డి, 20 మంది మతోన్మాదులు మూకదాడికి పాల్పడటం అత్యంత దుర్మార్గమని వక్తలు విమర్శించారు. రామరాజ్యమంటే హింసాత్మక దాడులు చేయటమేనా? అని ప్రశ్నించారు. మతోన్మాదుల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాలని పిలుపు నిచ్చారు. జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణ మూర్తి మాట్లాడుతూ రంగరాజన్‌ను బెదిరించడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేశారనీ, అడ్డొచ్చిన ఆయన కుమారుడిపై కూడా దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వీర రాఘవరెడ్డి అనే మతోన్మాది దుష్ట శిక్షణ శిష్ట రక్షణ అనే పేరుతో రామ రాజ్యాన్ని స్థాపించడానికి సైన్యం కావాలనీ, తెలుగు రాష్ట్రాల్లో 27,800 గ్రామాల్లో ప్రతి ఆలయం నుంచి ఒక యువ సైనికుడు తమ ఆర్మీలో చేర్పించే బాధ్యత అర్చకులదేననీ, తాను ఇక్ష్వాక వంశం శ్రీరాముడి వంశీయుడిని కాబట్టి ఇక్కడి దేవాలయ భూములు తమకు అప్పగించాలనీ, సైన్యం నిర్వహణ కోసం నిధులు ఇవ్వాలని బెదిరించటం ఏ ధర్మరక్షణో చెప్పాలని ప్రశ్నించారు. హిందూ ధర్మం కోసం చంపడానికైనా, చావడానికైనా సిద్ధమని చెప్పడం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని చెప్పారు. హిందూ ధర్మం పేరిట యువకులు నిధులు, భూములు విశ్వాసాలు పేరుతో బహిరంగంగా దాడులు చేయటం ఒక సంస్కృతిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని మతసామరస్యం కోరే ప్రతీ ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి మాట్లాడుతూ ఉన్మాదం తలకెక్కిన వీర రాఘవరెడ్డి లాంటి వ్యక్తులు రాష్ట్రంలో, దేశంలో అనేక మంది ఉన్నారనీ, అలాంటి వారిని పౌర సమాజం ఏరేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 128 కుల దురహంకార హత్యలు జరిగితే ఏ ఒక్క హత్యపైనా స్పందించని ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు కేవలం నాగరాజు అనే హిందువుపై ముస్లింలు మత దురహంకార హత్యకు పాల్పడితే ఆ ఒక్కదానిపైనే బండి సంజరు ,రాజాసింగ్ విద్వేషాన్ని రెచ్చగొట్టారని గుర్తు చేశారు. టీపీఎస్‌కే రాష్ట్ర నాయకులు జి రాములు, ఎస్వీకే కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ రామరాజ్యం, జైశ్రీరామ్ ఇలాంటి పదాలు భౌతిక దాడులు, దౌర్జన్యాలు, లైంగికదాడులు చేయడానికి ఉపయోగిస్తున్న పదాలుగా ఉండటం శోచనీయమన్నారు. హత్యలను దాడులను హిందూ ధర్మం అంగీకరిస్తుందా? అని ప్రశ్నించారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ అండదండలతో దేశంలో మతవిద్వేషాలు హింసాత్మక, మతోన్మాద దాడులు పెట్రేగిపో తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పొద్దున లేస్తే హిందూ మతం ప్రమాదంలో ఉందని చెబుతూ మత రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రంగరాజన్‌పై జరిగిన దాడిని స్వయంగా సీఎం ఫోన్‌లో మాట్లాడి ఖండించినట్టుగానే రాష్ట్రంలో జరిగిన కుల దురహంకారుల హత్యల సందర్భంగా బాధితులకు అండగా నిలబడగలిగితే ప్రభుత్వం పట్ల పేదలకు నమ్మకం కలుగుతుందన్నారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి కృష్ణాజీ, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ చినుకు సంస్థ డైరెక్టర్ పి ఎన్ మూర్తి, కేవీపీఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం దశరథ్ బి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# 'వందేండ్ల ముందుచూపు' పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ రచించిన 'వందేండ్ల ముందుచూపు' పుస్తకాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో ఆవిష్కరించారు. దశాబ్ద కాలంపాటు కేసీఆర్ కృషితో రాష్ట్ర పునర్నిర్మాణంలో నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి బలమైన పునాదులు వేశారని రచయిత తెలిపారు. ఆర్బీఐ నివేదిక గణాంకాలతో ఆ పుస్తకాన్ని రచించి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆయనకు కానుకగా అందించారు. చితికిపోయిన తెలంగాణ పల్లెను తిరిగి చిగురించేటట్టు చేశారని పేర్కొన్నారు. నీళ్లెక్కని ఎగువ భూములకు నీళ్లందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. అనేక రంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణను పదేండ్లలో దేశానికే మోడల్‌గా చేశారంటూ ఆర్బీఐ చెప్పిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఒద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కెళ్లపల్లి రవీంద్రరావు, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, వి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కి సవాల్ విసిరిన టీపీసీసీ చీఫ్..



హైదరాబాద్:అమృత్ తెలంగాణ: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేంద్రమంత్రి బండి సంజయ్ కి సవాల్ విసిరారు. బీసీల బిల్లును 9వ షెడ్యూల్ లో పెట్టే దమ్ముందా బీజేపీకి అంటూ ఛాలెంజ్ చేశారు. తెలంగాణలో కులగణనపై బీజేపీ, బీఆర్ఎస్ ఏదోక వివాదం సృష్టించాలని చూస్తున్నాయని ఆయన మండిపడ్డారు. రీసర్వే పూర్తయ్యాక మార్చిలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల(42% ) బిల్లును ప్రవేశపెట్టి ఆమోదిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఈ బిల్లును కేంద్రరానికి పంపిస్తామని, ఎలాగైనా సరే పార్లమెంటులో బిల్లుకు ఆమోదముద్ర పడేలా చూస్తామని అన్నారు. ఈ బిల్లు గురించి మాట్లాడుతున్న బండి సంజయ్ సహ పలువురు బీజేపీ నేతలు దమ్ముంటే ప్రధాని మోడీని ఒప్పించి ఈ బిల్లును 9వ షెడ్యూల్ లో పెట్టండి అంటూ సవాల్ విసిరారు. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా మీరు మోడీతో మాట్లాడగలరా అంటూ నిలదీశారు.

# అర్హులందరికీ రేషన్‌కార్డులు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల జారీకి వెంటనే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లోలేని జిల్లాల్లో వెంటనే కార్డులు ఇచ్చేయాలని చెప్పారు. కోడ్ ముగిసిన వెంటనే ఇతర జిల్లాల్లోనూ సత్వరం రేషన్‌కార్డుల జారీకి ఏర్పాట్లు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, కులగణన సందర్భంగా ఇచ్చిన సమాచారం, గ్రామ సభలు, మీ-సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ వేగంగా పరిశీలించే ప్రక్రియను పూర్తిచేయాలని చెప్పారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారంనాడిక్కడి కమాండ్ కంట్రోల్ రూంలో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త రేషన్‌కార్డుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులకు అవకాశ మిచ్చినప్పటికీ, మీ-సేవా కేంద్రాల వద్ద రేషన్ కార్డుల కోసం ఎందుకు రద్దీ ఉంటుందని ఆయన అధికారుల్ని ప్రశ్నించారు. దీనిపై వారు స్పందిస్తూ దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ మళ్లీ చేస్తున్నాయనీ, అందువల్లే రద్దీ ఎక్కువగా ఉంటున్నదని వివరణ ఇచ్చారు. దరఖాస్తులు వచ్చిన వెంటనే కార్డులు జారీ చేస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా వెంటనే కొత్త కార్డులు జారీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన కుటుంబాలు మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డులకు సంబంధించి పౌర సరఫరాల విభాగం తయారు చేసిన పలు డిజైన్లను ఆయన పరిశీలించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యకార్యదర్శి దేవేందర్ సింగ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# వెళ్లొద్దని చెప్పినా వినలేదు




న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ:అది సెంట్రల్ ఢిల్లీలోని లోక్‌నాయక్ జయప్రకాష్ ఆస్పత్రి. దాని ఎమర్జెన్సీ వార్డు వెలుపల పలువురు ఆతృతగా ఎదురు చూస్తూ కన్పించారు. తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు ఎవరూ కన్పించకపోవడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన వారెవరు, గాయపడిన వారెవరు అంటూ అధికారులను ఆరా తీస్తున్నారు. ఎవరి ముఖంలో చూసినా ఆతృత, అసహనం, ఆందోళన, ఆగ్రహం కలగలిసి కన్పిస్తున్నాయి. ఆస్పత్రి వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకవైపు మృతులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు గాయపడిన వారిని అత్యవసర వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

'ఇక్కడ సౌకర్యాలు లేవు. సాయం చేసే నాథుడూ లేడు' అని వీరేంద్ర గద్గద స్వరంతో వాపోయారు. ఆయన్ని కదిలిస్తే కన్నీరు ధారాపాతంగా కారిపోతోంది. చాలా సేపటి నుండి ఎదురు చూస్తున్నానని, ఎవరూ ఏమీ చెప్పడం లేదని తెలిపారు. చనిపోయిన వారిలో ఆయన భార్య పూనం రోహిల్లా కూడా ఉన్నారు. గంటల తరబడి గాలింపు ఫలితంగా ఆమె మృతదేహం కన్పించింది. పూనం తన స్నేహితులతో కలిసి కుంభమేళాకు బయలుదేరారు. అయితే ఈ తీర్థయాత్ర చాలా మందికి విషాదంగా మారింది. మరో కుటుంబానిదీ అదే కథ. హర్యానాలోని పానిపట్‌కు చెందిన సంతోష్ మెహతో తన భార్య మరణ వార్త వినగానే హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. భార్య మృతదేహం కోసం ఆయన మార్చురీ ఎదుట ఎదురు చూస్తూ కూర్చున్నారు. 'ఢిల్లీలో జరిగిన ఘటన గురించి విన్నాను. నా భార్యతో పాటు కుమారుడు, మేనల్లుడు కూడా ఉన్నారు' అని ఆయన అన్నారు. తల్లి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం పానిపట్ తీసికెళ్లేందుకు ఆమె ముగ్గురు పిల్లలు ఎదురు చూపులు చూస్తున్నారు.

మరోవైపు ఆస్పత్రి లోపల వైద్యులు క్షణం తీరికలేకుండా శవ పరీక్షలు చేస్తున్నారు. మరికొందరు క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ కొందరు సీనియర్ వైద్యులతో కలిసి ఒక వార్డు నుండి మరో వార్డుకు పరుగులు పెడుతున్నారు. చికిత్స కోసం వస్తున్న క్షతగాత్రుల సంఖ్య పెరుగుతుండడంతో వారికి వైద్య సేవలు అందించడంతో తలమునకలవుతున్నారు. చనిపోయిన వారిని ఒకరి తర్వాత ఒకరుగా శవ పరీక్షల నిమిత్తం మార్చురీకి పంపుతున్నారు. గాయపడిన ప్రయాణికులను ఐసీయూకు, ఆ తర్వాత ఆర్థోపెడిక్ విభాగానికి తరలిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు కూడా ఆయా విభాగాలకు చేరుకుంటూ తమ వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.

మృతుల్లో 47 సంవత్సరాల షీలా దేవి ఒకరు. ఇద్దరు పిల్లల తల్లి అయిన షీలా దేవి భర్త, కుమారుడితో కలిసి కుంభమేళాకు పయనమయ్యారు. తొక్కిసలాటలో ఆమె ప్రాణాలు కోల్పోగా భర్త ఉమేష్ గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ స్థితిలో కుమారుడు అమన్ గిరి ఒంటరివాడయ్యాడు. కుంభమేళాలకు వెళ్లవద్దని తల్లికి సలహా ఇచ్చానని, కానీ ఆమె వినిపించుకోలేదని చెప్పాడు. తల్లి మృతదేహాన్ని మార్చురీకి తరలించడంలో అమన్ సాయపడడం అందరినీ కలచివేసింది. రైల్వే స్టేషన్‌లో జరిగిన విషాద ఘటనను గుర్తు చేసుకుంటూ 'మెట్ల మీద జనం రద్దీ అధికంగా ఉన్నదని మా అమ్మ చెప్పింది. మా అమ్మ బాగా లావుగా ఉంటుంది. కాబట్టి మెట్లు ఎక్కలేకపోయింది. తొక్కిసలాట నుండి తప్పించుకునేందుకు ప్రతి ఒక్కరూ మెట్ల వైపు పరుగులు తీశారు' అని చెప్పాడు. కాగా మనోజ్ షా 11 సంవత్సరాల కుమార్తె సురుచి తొక్కిసలాట ఘటనలో తప్పిపోయింది. తన బావమరిది ముకేష్ నుండి వచ్చిన ఫోన్ కాల్‌ను ఆయన గుర్తు చేసుకుంటూ 'తొక్కిసలాట జరిగిందని, జనం ఒకరిపై ఒకరు పడిపోయారని అతను నాకు చెప్పాడు. నా అత్తమామలు కూడా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. గాయాలతో బయట పడిన ముకేష్ ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నారు' అని తెలిపారు.

# డిగ్రీ సైన్స్ కోర్సుల్లో మ్యాథ్స్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో డిగ్రీలో బయాలజీ, బాటనీ, మైక్రోబయాలజీ వంటి సైన్స్ కోర్సుల్లో మ్యాథ్స్ కూడా ఉండాలని ఉన్నత విద్యామండలి సమాలోచన చేస్తున్నది. సైన్స్ విద్యార్థులకు ఆర్థమెటిక్, రీజనింగ్ ఉంటే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చింది. అందులో భాగంగానే బీఎస్సీ (బీజెడ్‌సీ) కోర్సులో మ్యాథ్స్ సబ్జెక్టును చేర్చాలని భావిస్తున్నది. ఈ దిశగా డిగ్రీ సిలబస్‌ను మార్చాలని ఉన్నత విద్యామండలి అధికారులు కసరత్తు చేస్తున్నారు. డిగ్రీ పూర్తయ్యాక పోటీ పరీక్షల కోసం విద్యార్థులు సన్నద్ధమవుతున్న విషయం తెలిసిందే. గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల్లో మ్యాథ్స్‌కు సంబంధించిన ఆర్థమెటిక్, రీజనింగ్ అంశాలపై ప్రశ్నలుంటాయి. వాటిని అర్థం చేసుకుని మార్కులను సంపాదించడం కోసం సైన్స్ అభ్యర్థులు కోచింగ్‌ల బాట పడుతున్నారు. రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ విషయం ఉన్నత విద్యామండలి, విశ్వవిద్యాలయాల దృష్టికి వచ్చింది. అందు కోసమే డిగ్రీ స్థాయిలోనే సైన్స్ విద్యార్థులకు మ్యాథ్స్‌పైనా అవగాహన కల్పిస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చాయి. ఈ దిశగా సిలబస్‌లో మార్పులు చేసే అవకాశమున్నది.ల సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బీఏ ఆర్ట్స్, సోషల్ సైన్స్, బీఏ ఆనర్స్ (తెలుగు) సిలబస్‌పై సబ్జెక్టు నిపుణుల సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించేలా సిలబస్‌లో మార్పులు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఈ పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలను తొలగిస్తేనే ఆమోదిస్తాం..బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందో కూలుతుందో తెలియడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. మంత్రులు 15% కమీషన్ దండుకుంటున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందని ఆరోపించారు. ముస్లింలను BCల జాబితా నుంచి తొలగించాల్సిందేనని డిమాండ్ చేశారు. కులగణన బిల్లు అలాగే పంపుతామంటే తామెందుకు ఆమోదిస్తామని, ముస్లింలను BCల జాబితా నుంచి తొలగించి పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు.

## అదిలాబాద్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ గౌడ్ శుభ కార్యక్రమానికి హాజరై బోరంచు శ్రీకాంత్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించిన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి.




కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి కి జన్మదిన సందర్భంగా కేక్ తిన పెడుతున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



పసుల చంటి మరియు సిహెచ్ రాజేష్ లా సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి కి సన్మానిస్తున్న దృశ్యం



శుభకార్యానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి


అదిలాబాద్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ గౌడ్ శుభ కార్యక్రమానికి హాజరై బోరంచు శ్రీకాంత్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించిన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి. ఈసందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి,పసుల చంటి, జైనథ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు %జష్ట్ర%.రాకేష్ ల జన్మదిన వేడుకలు ఇచ్చోడ మండల కాంగ్రెస్ కమీటి కార్యాలయంలో నిర్వహించగా అట్టి జన్మదిన వేడుకలకు హాజరై వారికీ జన్మదిన శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి వారికీ తినిపించడం జరిగింది. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమీటీ చైర్మెన్ గంగారెడ్డి ,ఇచ్చోడ మార్కెట్ కమీటి చైర్మన్ కోటేష్ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఇచ్చోడ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, సామన్‌పల్లి శేఖర్ , ముస్తాఫా,లక్ష్మణ్ ,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు పరమేశ్వర్, ఇచ్చోడ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ క్రాంతి కిరణ్, తలమడుగు యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సాయి కిరణ్, టౌన్ యూత్ ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

# భైంసా ఆర్టీసీ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేత..

### బస్టాండ్ కన్నా ముందే అక్కడ కాలనీలు నిర్మాణం. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలి .. సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సభ పండరి..........,



డిపో మేనేజర్కు వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ సప పండరీ, బృందం



డిపో మేనేజర్ కు ఇచ్చిన వినతి పత్రం ప్రోఫార్మా

నిర్మల్ జిల్లా కుబీర్ ఫిబ్రవరి 17 అమృత్ తెలంగాణ కుబీర్, బస్టాండు చుటూ టీఎస్ఆర్టిసి ప్రహరీ గోడ నిర్మించాలనుకుంటున్నందున, గ్రామంలోని''''న్యూ అబాదిబిగణేష్ నగర్''''కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, న్యూ అబాదిబిగణేష్, నగర్ ముందుగా ఏర్పడ్డాయని, ఆ తరువాతనే బస్టాండు ఏర్పడిందని, వందలాది కుటుంబాలు పడమర దిక్కున హనుమాన్ ఆలయం నుండి నిత్యం ప్రజలు నడుస్తారని, నడిచే వాళ్లకు ఇబ్బంది కాకుండా ప్రహరీ గోడ నిర్మించాలని, అంతే కాకుండా వర్ష కాలంలో ప్రాంగణం మొత్తం బురదమయంతో ఉండడం వలన ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని, ప్రయాణికుల సౌకర్యార్థం కోసం సిమెంట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి, గ్రామస్తులు బోయిడి రవి, రవికాంత్, పాల్గొన్నారు

# నిర్మల్ పోలీస్...... మీ పోలీస్.

## నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ పోలీస్ కార్యాలయంలో'' ప్రజావాణి'' కార్యక్రమం



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : బాధితుల సమస్యల పట్ల విచారణ చేపట్టి పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ. ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన "ప్రజావాణి "కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ఫిర్యాదు దారులు నిర్మల్ జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదులు అందజేయడం జరిగింది .వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 07 వినతి పత్రాలను స్వీకరించారు. ఇందులో ముఖ్యంగా భార్యాభర్తల సంబంధిత ఫిర్యాదులు (1), భూ వివాదాలు(5), కుటుంబ కలహాలు (1) మొదలైన వివిధ అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ గారు అందిన వినతి పత్రాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు. ప్రజలకు శాంతి భద్రతలకు సంబంధించి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

# మాలక్ష్మి టెంపుల్ గదుల నిర్మాణానికి 25 వేల రూపాయలను అందించిన తేలు నారాయణ,...

### విరాళం అందజేసిన దాతను సన్మానించిన గ్రామ పెద్దలు...



విరాళం అందజేసిన దాత తేలు నారాయణ దంపతులను ఘనంగా సన్మానించిన గొల్లమడ గ్రామ పెద్దలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి 17 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తేలు నారాయణ, గొల్లమడ మహాలక్ష్మి టెంపుల్ గదుల నిర్మాణానికి 25000 రూపాయలను విరాళంగా అందజేశారు ఆయన తన వంతు సాయంగా టెంపుల్ గదుల నిర్మాణానికి చేయూత అందించినందుకు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్సర్పంచ్ చెన్న మహేష్, నాకిడి లస్మయ, ఉపాధ్యాయులు కే లక్ష్మణ్ నాకిడి రమేష్, గంగాధర్, సొన్నా గంగాధర్, తోట లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు

# పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి.

### క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పరీక్షలకు సన్నద్ధం కావాలి.

### లెఫ్ట్ పోచంపాడ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు పాఠాలు బోధించిన...

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గది లో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి లెక్కలను విద్యార్థులచే చేయించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఉన్న సమయాన్ని సరిగ్గా వినియోగించుకుంటూ పరీక్షలకు సిద్ధంకావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. సిలబస్ ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఒత్తిడి లేకుండా చదవాలన్నారు. విద్యార్థులందరూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదిలో పదికి పది పాయింట్లు సాధించిన విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. సబ్జెక్టుల్లో ఎటువంటి సందేహాలు ఉన్నా ఆయా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి రామారావు, కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, తహసిల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసిన tb జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ :సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలోని ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాగ్రి భద్రతపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల సామాగ్రిని అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు జిల్లాకు చేరుతున్న సామాగ్రి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న పలు ఎన్నికల సామాగ్రి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# కుస్లిలో ఘనంగా మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు...

### జన్మదిన వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న బిఆర్ఎస్ కార్యకర్తలు



కుస్లీ లో ఘనంగా కెసిఆర్ బర్త్డే వేడుకలు



కుస్లీ లొ కెసిఆర్ జన్మదిన సందర్భంగా టపాసులు తెలుస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి 17 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని కుస్లి, గ్రామంలో బిఆర్ఎస్ కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కుస్లీ అంబేద్కర్ చౌక్ లో కెసిఆర్ జన్మదినాన్ని పెద్ద ఎత్తున టపాసులు పేల్చి కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు

# ప్రజావాణి కి 69 దరఖాస్తులు



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఈ రోజు ప్రజావాణి లో 69 దరఖాస్తులు వివిధ రకాల సమస్యల పై వచ్చాయని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించి పంచాయితి, విద్యుత్, వ్యవసాయం, విద్యా, వైద్యం, మహిళా శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్, రెవెన్యూ, తదితర శాఖలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఇస్తూ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు ఈ ప్రజావాణి లో రెవెన్యూ డివిజన్ అధికారి వినోద్ కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# సమతా కుంభ్ లో ప్రతిభ కనబరిచిన చిన్నారి ఐరారెడ్డి..



నిర్మల్ జిల్లా/ సారంగాపూర్ :అమృత్ తెలంగాణ: శ్రీరామానుజాచార్య-తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముచింతల్ లో గల సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆదివారం జరిగిన మహానాట్య బృందం 4 రికార్డ్స్ నమోదు చేసింది. సమతా మూర్తి స్ఫూర్తి ఘంటసాల పవన్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాల నుంచి వచ్చిన 3 వేల మంది చిన్నారులు వివిధ నృత్య రూపాలతో చేసారు. ఇండియన్ వరల్డ్ రికార్డు,వండర్ బుక్ అఫ్ రికార్డ్స్, నృత్య గోల్డెన్ స్టార్ రికార్డు, జీనియస్ బుక్ అఫ్ రికార్డ్స్ వంటి నాలుగు రికార్డులను అందజేశారు. అందులో భాగంగా మండలం లోని బోరిగామ్ గ్రామానికి చెందిన బెజ్జంకి లక్ష్మీ - ముత్యం రెడ్డి ల కుమార్తె చిన్నారి ఐరా రెడ్డి నృత్యంలో ప్రతిభ కనబరిచింది చిన్నరికి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి గోల్డెన్ స్టార్ రివార్డ్ ను అందజేసి ఆశీర్వదించారు.ఈ సందర్బంగా చిన్నారిని పలువురు మండలవాసులు అభినందించారు.

# 2061 నాటికి భారత్ జనాభా 170 కోట్లు



జెనీవా:అమృత్ తెలంగాణ: ప్రపంచ జనాభా ధోరణులపై ఐక్యరాజ్య సమితి(ఐరాస) అంచనాలు విడుదల చేసింది. 2061 నాటికి భారత్ జనాభా 170 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. 2100 నాటికి 150 కోట్లకు తగ్గుతుందని పేర్కొంది. చైనా జనాభా 2061 నాటికి సుమారు 120 కోట్లకు తగ్గుతుందని.. 2100 నాటికి మరింత తగ్గి 63 కోట్లకు పరిమితం అవుతుందని ఐరాస అంచనా వేసింది. చైనా జనాభా 2021 నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టినట్టు ఐరాస వెల్లడించింది.

2100 నాటికి చైనా కంటే రెండున్నర రెట్లు ఎక్కువ

2100 నాటికి చైనా జనాభా కంటే భారత జనాభా రెండున్నర రెట్లు ఎక్కువ ఉంటుందని ఐరాస నివేదిక తెలిపింది. మరోపక్క 2024-54 మధ్య చైనా జనాభాలో భారీ ఎత్తున తగ్గుదల నమోదవుతుందని పేర్కొంది. ప్రస్తుతం చైనా జనాభా 141 కోట్లని, 2054 నాటికి 121 కోట్లకు తగ్గుతుం దని తెలిపింది. 2100 నాటికి అది 63.3 కోట్లకు పడిపోతుందని అంచనా వేసింది. అదే విధంగా జపాన్, రష్యాలోనూ జనాభా వేగంగా దిగొస్తుందని వెల్లడించింది. తాజా నివేదిక అంచనా ప్రకారం 2024-54 మధ్య చైనా జనాభా 20 కోట్లు, జపాన్ జనాభా 2 కోట్లు, రష్యా జనాభా కోటి తగ్గనుంది.

సంతాన సాఫల్యత రేటు పడిపోవడమే కారణం

2024లో 820 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా 2080ల్లో గరిష్టానికి చేరుతుందని ఐరాస నివేదిక అంచనా వేసింది. వచ్చే 50-60 ఏండ్లలో ప్రపంచ జనాభా 1030 కోట్ల వద్ద గరిష్టానికి చేరుకుని అక్కడి నుంచి దిగొస్తూ ఈ శతాబ్దం చివరకు 1020 కోట్లకు తగ్గుతుందని తెలిపింది. సంతాన సాఫల్యత రేటు గణనీయంగా పడిపోవడమే జనాభా తగ్గడానికి కారణమని ఐరాస నివేదిక వివరించింది. చైనాలో సగటున ఒక్కో మహిళ తమ జీవితకాలంలో ఒకరికి మాత్రమే జన్మనిస్తున్నట్టు తెలిపింది. సంతాన సాఫల్యత రేటు 2.1 ఉండాలని, అప్పుడే ప్రస్తుత జనాభా అలాగే కొన సాగుతుందని ఐరాసలో జనాభా విభాగాధిపతి జాన్ విల్మోత్ తెలిపారు. 1.8 లేదా 1.5 కంటే తక్కువకు చేరితే జనాభా గణనీయంగా పడిపోతుందని పేర్కొన్నారు. చైనా సహా మరికొన్ని దేశాల్లో ప్రస్తుతం అదే జరుగుతోందని వివరించారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం..



సారంగాపూర్ :అమృత్ తెలంగాణ: మండలంలోని వైకుంఠపూర్ గ్రామంలో గల పురాతన ప్రభు స్వామి శివాలయం పునర్నిర్మాణ మందిరంలో సోమవారం ప్రధాన అర్చకులు ఆనంద్ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రావణ్ కుమార్, రాజు, ప్రవీణ్ శర్మ చే విగ్రహాలు మల్లికార్జున స్వామి, లక్ష్మీనరసింహ స్వామి, సంతాన లక్ష్మీదేవి, హనుమాన్ సహిత నవగ్రహాలు ధ్వజస్థంభం, శిఖర ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా శని, ఆదివారాల్లో గణేష్, గౌరీ, దేవత మండప పూజ అష్టోత్తర కలశ పూజలు సోమవారం పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు,వి డిసి ఆధ్వర్యంలో మహా అన్నదాన చేసారు. మండల వాసులతోపాటు చుట్టూ ప్రక్కల గ్రామాల భక్తులు వేలదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## యశోద ఆస్పత్రిలో అరుదైన గుండె శస్త్ర చికిత్స




ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: ఎలాంటి లక్షణాలు కనిపించకుండా గుండెపోటు వచ్చిన ఓ వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్స చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడినట్లు సోమాజిగూడ యశోద హాస్పిటల్ కార్డియాలజిస్ట్ పంకజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని గజానన్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మిడియా సమావేశంలో ఆయన పాల్గొని వివరాలు తెలియచేశారు. ఇంద్రవెల్లికి చెందిన రాజు అనే వ్యక్తికి లక్షణాలు లేకుండానే గుండె పోటు వచ్చిందన్నారు. నెలన్నర కిందగా విరేచనాలతో ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. పలు విధానాల్లో వైద్యం అందించిన ఆయనకు బీపీ ఎక్కువ కావడం లేదని గమనించారన్నారు. తర్వాత 2డీ ఈకో తీయగా రక్తనాళాలు మూసుకుపోగా గుండెపోటు వచ్చినట్లు గుర్తించామన్నారు. పలు పరీక్షలు చేయగా ఈ విషయం పడినట్లు వెల్లడించారు. ముందుగా గజనన్ హాస్పలో చికిత్స చేసిన అనంతరం తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. యశోద ఆసుపత్రిలో అత్యంత అరుదుగా నిర్వహించే శస్త్ర చికిత్స చేసి బాధితుడి ప్రాణాలు కాపడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన క్షేమంగా ఉన్నారని డిశ్చార్జ్ చేశామన్నారు. బీపీ తక్కువ అయినా.. గుండెలో నొప్పి అనిపించినా ఎలాంటి ఆలస్యం చెయ్యకుండా వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలని సూచించారు.

## సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం..

అమృత్ తెలంగాణ: జన్నారం:కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమా బొజ్జు పటేల్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ..30 సంవత్సరాల కల కాంగ్రెస్ ప్రభుత్వం తొ సాధ్యం అయిందన్నారు. ఎస్సీ కేటగిరీలో ఎవరి జనాభా ఎంతో, వారి వాటా అంత ఇది సామజిక న్యాయం అని, ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొని ఆడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తే ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు అన్నారు. మందకృష్ణ మాదిగ కృషి నేడు ఫలించింది అన్నారు

## డీసీసీ అధ్యక్షులు జన్మదిన వేడుకలు



నిర్మల్: అమృత్ తెలంగాణ:సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు విలాస్ రావు అధ్వర్యంలో అదివారం డీసీసీ అధ్యక్షులు శ్రీ హరిరావు పుట్టిన రోజు సందర్భంగా అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సాయిలింగి గ్రామంలో గల "సాయి వృద్ధాశ్రమంలో వృద్దులకు అన్నదానం, ఫ్రూట్స్, స్వీట్స్, పంచి శ్రీహరి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే..



అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ముందుగా ఆయన కావడిగుండ్ల లో షేక్ జలాలుద్దీన్ - బీష్జాన్ దంపతుల కుమారుడి పంచెకట్టు,కుమార్తె నూతన వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను దీవించారు.నారాయణపురంలో గత వారం రోజులు గా అత్యంత వైభవంగా జరుగుతున్న కట్టమైసమ్మ అమ్మవారిజాతర ఆఖరి రోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. జ్ఞానాల వెంకటేశ్వరరావు మనవడు,మనవరాలి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు,స్థానిక కార్యకర్తలు,పార్టీ అభిమానులు,వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## నదిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి..



ముధోల్ :అమృత్ తెలంగాణ: బాసర గోదావరి నది మొదటి ఘాట్ వద్ద సోమవారం గోదావరి నదిలో స్నానమాచరిస్తూ ప్రమాదవషాత్తు కాలుజారి ఒకరు మృతి చెందినట్లు ఎస్ ఐ గణేష్ తెలిపారు. ఎస్ఐ తెల్పిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ మండలం రత్నల్లి గ్రామానికి చెందిన పవార్ బాలాజి (25) కుటుంబ సమేతంగా శుభకార్యానికి వచ్చాడు.నది లో స్నామాచారిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారీ నదిలో నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు సమాచారంతో నదిలో మృత దేహాన్ని వెలికితీసి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న ఎస్సై గణేష్ తెలిపారు. మృతుడికి భార్య,కుమారుడు వున్నారు.మృతదేహాన్నీ పోస్టుమార్టం నిమిత్తం బైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# నర్సాపూర్ జి కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన తాసిల్దార్ శ్రీనివాస్,...

**తాజా కూరగాయలు నిత్యవసర సరుకులు ఉండే విధంగా చూడాలని సిబ్బందికి సూచన పరిసరాలను వంటగదిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన తహసిల్దార్**



కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న తహసిల్దార్




నర్సాపూర్ జి కేజీబీవీ లో రికార్డులను పరిశీలిస్తున్న తహసిల్దార్



బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో ప్రమాణం చేయిస్తున్న తాసిల్దార్



వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి 17 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను నర్సాపూర్ జి తాసిల్దార్ సోమ శ్రీనివాస్, ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు అదేవిధంగా నిత్యవసర సరుకులు తాజా కూరగాయలు ఎప్పటికప్పుడు వాడాలని వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు అక్కడి పరిసరాలను పరిశీలించి సంతృప్తి చెందారు ఆయన వెంట ఆర్ఐ వేణుగోపాల్, ఎస్ఓ, వీణ, సిబ్బంది ఉన్నారు

## భూకబ్జా, ఆక్రమణల పై ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 9492164153. కు మంచి స్పందన మున్సిపల్ కమిషనర్ సీవీయన్ రాజు.







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : టోల్ ఫ్రీ నెంబర్ కి స్పందన వస్తున్నదని, పట్టణం లో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నందున జిల్లా కలెక్టర్ ఇటీవల సమావేశాన్ని ఏర్పాటు చేసి టాస్క్ ఫోర్స్ టీం ను ఏర్పాటు చేసి మున్సిపల్ కార్యాలయం లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఈ రోజు సోమవారం టోల్ ఫ్రీ నెంబర్ కి స్పందించి KRK కాలనీ లో వెలసిన అక్రమ కట్టడాన్ని టాస్క్ ఫోర్స్ టీం తొలగించారు. టోల్ ఫ్రీ నెంబర్ కి స్పందించి అక్రమ కట్టడాన్ని తొలగించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు .

## రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఇసుక వేలం.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : ఇటీవలి నిర్మల్ గ్రామీణ మండలం పరిధిలో వివిధ గ్రామాల్లో అక్రమంగా పట్టుబడ్డ 35 ట్రాక్టర్ల ఇసుక వేలంపాటను సోమవారం మంజులాపూర్ సమీపంలో అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నారు. కాగా 64700 రూపాయలకు ఇసుకను వేలం పాటలో షేక్ ముబీన్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ వేలంపాటలో నిర్మల్ గ్రామీణ మండలం తహసీల్దార్ సంతోష్ కుమార్, రెవెన్యూ ఇన్స్ పెక్టర్ విజయ్ కుమార్, నిర్మల్ గ్రామీణ ఎస్సై లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు..

ముధోల్ : బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా సోమవారం బీఆర్ ఎస్ నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మండల కేంద్రం లోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రోగులకుపండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు గంగాధర్, లతీప్, కన్నోళ్ల అంజయ్య, పెండెల లక్ష్మన్, పోతుగంటి లక్ష్మన్, మరిబా, గంగాధర్ పాల్గొన్నారు.



# గాంధీభవన్ యందు టీపీసీసీ ఓబీసీ విభాగం విస్తృత స్తాయి సమావేశంలో పాల్గొన్న మాజీ తాజా కౌన్సిలర్ అంబకంటి అశోక్



టీపీసీసీ ఓబీసీ విస్తృత సాయి సమావేశంలో పాల్గొన్న అంబకంటి అశోక్



సమావేశంలో పాల్గొన్న అదిలాబాద్ జిల్లా ఓబీసీ చైర్మన్ అంబకంటి అశోక్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గాంధీభవన్ యందు టిపిసిసి ఓబీసీ విభాగం విస్తృత స్తాయి సమావేశంలో పాల్గొన్న మాజీ తాజా కౌన్సిలర్ అంబకంటి అశోక్ కాంగ్రెస్ పార్టీసంబంధించిన కులగనన మరియు ఒక ఉద్యోగ ఉపాధి అవకాశాలపై సమావేశం ఏర్పాటు చేయడమైనది ఇట్టి సమావేశంలో అందరి యొక్క అభిప్రాయాలను కూలంకషంగా పరిశీలించి చర్చిస్తూ అందరి సమ్మతం మేరకు అధిష్టానం వద్దకు పంపనయినది ఇట్టి సమావేశంలో ఏఐసీసీ ఓబీసీ జాతీయ అధ్యక్షులు అజయ్ సింగ్ యాదవ్ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తోపాటు టిపిసిసి ఓబీసీ అధ్యక్షులు నూతి శ్రీకాంత్ గౌడ్ గారి తో పాటు ఆదిలాబాద్ జిల్లా ఓబీసీ చైర్మన్ అంబకంటి అశోక్ పాల్గొన్నారు. ముఖ్యంగా కుల గణన కు సంబంధించిన బీసీలకు 42% రిజర్వేషన్లను అమలుపరచుటకై చట్ట రూపంలో చేయుటకు తీర్మానం చేయడం జరిగింది

# తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త..త్వరలో 25వేల నోటిఫికేషన్లు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సుప్రీంకోర్టు తీర్పు, రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఎస్సీ వర్గీకరణ సాధ్యం అయిందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మరో 15-20 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం రాబోతున్నదని.. చట్టం రాగానే 25 వేల పోస్టులతో వివిధ పోస్టుల భర్తీకి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల కాబోతున్నదని చెప్పారు. సోమవారం హైదరాబాద్ టూరిజం కన్వెన్షన్ హాల్ లో ఎస్సీ వర్గీకరణపై మాదిగ నేతలతో మంత్రి దామోదర సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక ఆరు నెలల్లోనే 90 శాతం వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. వర్గీకరణ చేసే వరకు నోటీఫికేషన్లు ఇవ్వమని సీఎం చెప్పారని ఇచ్చిన మాటకు కట్టుబడి కొత్తనోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. వర్గీకరణపై కొంత మంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అందరి అనుమానాలను నివృత్తి చేసే బాధ్యత తమదేనన్నారు. తెలంగాణ వస్తే మనందరి తలరాతలు మారుతాయని భావించినట్టుగానే ఎస్సీ వర్గీకరణతో సంపూర్ణంగా మాదిగలందరి తలరాతలు మారుతాయనుకోవడం పొరపాటు అన్నారు మంత్రి దామోదర. వర్గీకరణ వల్ల ఎవ్వరి వాటా వల్ల వారికి అడ్మిషన్లు, ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

# సండే పూట చేపల వేట



ఖమ్మం :అమృత్ తెలంగాణ: ప్రతి ఆదివారం సందడిగా ఉండే చికెన్‌షాపులు బర్డ్‌ఫ్లూ ప్రచారంతో నిన్నటి ఆదివారం వెలవెలబోయాయి. ముందుజాగ్రత్తగా చికెన్ తినడం మానేస్తున్న మాంసం ప్రియులు చేపలు, మటన్ దుకాణాలకు క్యూ కట్టారు. చేపలు, మటన్ అమ్మకాలు జోరందుకోవడంతో ఒక్కసారిగా ధరలు పెంచారు. గతంలో కిలో మటన్ రూ. 700-రూ. 800 వరకు విక్రయించేవారు. నిన్నటి ఆదివారం మాత్రం అదనంగా రూ. 100 వసూలు చేశారు. అలాగే, సాధారణంగా రూ. 130-రూ. 150 వరకు అమ్మే బొచ్చ, రవ్వ, బంగారుతీగ వంటి చేపలను ఏకంగా కిలో రూ. 180కి పైగా విక్రయించారు. జల్ల రకం చేపను మాత్రం రూ. 150కి అమ్మారు. బర్డ్‌ఫ్లూ ప్రచారానికి ముందు కిలో రూ. 350 పలికిన కొర్రమీను ఇప్పుడు రూ. 450కి విక్రయిస్తుండటం గమనార్హం. ఇక కిలో రూ. 300 ఉండే రొయ్యలు.. నాణ్యతను బట్టి రూ. 400 వరకు అమ్మారు. లైవ్ ఫిష్‌కు రూ. 20-30 అదనంగా వసూలు చేశారు. చేసేదీలేక మాంసప్రియులు అదనపు రేటును భరించి కొనుగోలు చేశారు. ఖమ్మంలోని పలు మాంసం, చేపల విక్రయాల అడ్డాల్లో జనం భారీగా బారులుదీరారు. గంటలు వేచి ఉండి చేపలు, రొయ్యలు శుభ్రం చేయించుకున్నారు తప్ప చికెన్ జోలికి ఎవరూ వెళ్లకపోవడం గమనార్హం. అలాగే మటన్‌షాపుల వద్ద కూడా గంటల తరబడి వేచివున్నారు.

నూటికి 5శాతానికి మించి చికెన్ వ్యాపారమూ లేదు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాయే కాదు రాష్ట్రంలో అనేక చోట్ల నూటికి 5శాతానికి మించి వ్యాపారం లేదని చికెన్ దుకాణాల నిర్వాహకులు వాపోయారు. సాధారణంగా ఆదివారం చికెన్ కొట్టేందుకు అదనంగా వర్కర్లను పెట్టుకుంటారు. కానీ గత రెండు ఆదివారాల నుంచి అదనపు మనుషులు కాదు కదా.. ఉన్నవారికే పనిలేకుండా పోయిందని నిర్వాహకులు వాపోయారు. సాధారణంగా ఆదివారం ఖమ్మం జిల్లాలో 100 టన్నుల చికెన్ బిజినెస్ జరిగితే ఈ సండే నాలుగైదు టన్నుల వ్యాపారం కూడా లేదని చికెన్‌షాపుల యజమానుల సంఘం కార్యదర్శి పారా సత్యనారాయణ తెలిపారు. జిల్లాలోని వెయ్యి దుకాణాల్లో ఒక్కదానిలోనూ 5శాతానికి మించి వ్యాపారం లేదన్నారు. మాఘ మాసం కావడంతో శుభకార్యాలు, పెళ్లిండ్లు, ఫంక్షన్లు ఎక్కువగా ఉండటంతో ఆ ఐదు శాతమైనా విక్రయాలు జరిగాయన్నారు.

# మసీదు కూల్చివేత..యూపీ సర్కారుకు సుప్రీంకోర్టు షోకాజ్ నోటీసులు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుషీనగర్‌లోని మసీదును అక్రమ కట్టడంగా పేర్కొంటూ అధికారులు కూల్చివేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గతేడాది నవంబర్ 13న సుప్రీంకోర్టు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా.. ఇతర పక్షాల వాదనలు వినకుండా కూల్చివేత చర్యలను సుప్రీంకోర్టు నిషేధించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా.. కోర్టు ధిక్కార చర్యలకు పాల్పడిన సంబంధిత అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం యూపీ సర్కారుకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుషీనగర్ మసీద్ కేసులో తదుపరి కూల్చివేత చర్యలపై సుప్రీంకోర్టు నిషేధించింది. మద్ని మసీదు కొంత భాగాన్ని అధికార యంత్రాంగం కొంత మేరకు కూల్చివేసింది. వాస్తవానికి భూమిని ఆక్రమించి మసీదును నిర్మించారని ఆరోపణలున్నాయి. ఈ నెల ప్రారంభంలో మసీదులోని కొంత భాగాన్ని అధికారులు బుల్డోజర్‌తో కూల్చివేశారు. దీనిపై పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మసీదు నిర్మాణంలో ఎలాంటి ఆక్రమణ జరుగలేదని.. ఈ విషయాన్ని ఎస్‌డీఎం నివేదికలో ప్రస్తావించినట్లుగా పిటిషనర్ పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారులు మసీదును కూల్చివేశారని.. తనపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఫేక్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని పిటిషనర్ ఆరోపించారు. కూల్చివేతలకు ముందు అధికారులు తన వాదనలు చెప్పేందుకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. కూల్చివేత చర్యలను వెంటనే నిషేధించాలని.. కూల్చివేసిన మసీదును పునర్నిర్మించాలని.. లేకపోతే పరిహారం చెల్లించాలని పిటిషనర్ డిమాండ్ చేశారు.

# విభిన్నంగా 'రాబిన్‌హుడ్' సెకండ్ సింగిల్




ఇప్పటికే ఒక పాటను విడుదల చేసిన రాబిన్ హుడ్ టీం తాజాగా సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. మొదటి పాట మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే విధంగా సాగింది. రెండో పాటను ప్రయోగాత్మకంగా ప్లాన్ చేశారు. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో గతంలో వచ్చిన 'భీష్మ' సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. దాంతో వీరిద్దరి కాంబోలో ప్రస్తుతం రూపొందుతున్న 'రాబిన్‌హుడ్' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమాలో నితిన్‌కు జోడీగా మొదట రష్మిక మందన్న హీరోయిన్‌గా ఎంపిక అయింది. కానీ పుష్ప 2 సినిమా కోసం ఆమె ఎక్కువ డేట్లు కేటాయించాల్సి రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాబిన్‌హుడ్ సినిమాలో నితిన్‌కు జోడీగా రష్మిక స్థానంలో శ్రీలీలను నటింపజేశారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ వారు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అంచనాలు పెంచే విధంగా పాటలను విడుదల చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఒక పాటను విడుదల చేసిన రాబిన్ హుడ్ టీం తాజాగా సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. మొదటి పాట మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే విధంగా సాగింది. రెండో పాటను ప్రయోగాత్మకంగా ప్లాన్ చేశారు. పాపులర్ బ్రాండ్స్‌ను ఉపయోగించి పాటను ట్యూన్ చేశారు. లిరిక్స్‌లోనూ బ్రాండ్స్‌ను చెప్పడం ద్వారా వినూత్నంగా సెకండ్ పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. ఈ పాటతో సినిమా స్థాయి మరింతగా పెరుతుంది అనే విశ్వాసంను చిత్ర యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ పాటను విడుదల చేశారు. గత ఏడాది గుంటూరు కారం సినిమాలో మహేష్ బాబుకు జోడీగా శ్రీలీల నటించింది. ఆ సన్నిహిత్యంతోనే శ్రీలీల కోసం రాబిన్ హుడ్ సినిమాలోని ఈ రెండో పాటను మహేష్ బాబు విడుదల చేసి ఉంటారు అని తెలుస్తోంది. మొత్తానికి సూపర్ స్టార్ చేతుల మీదుగా పాట రిలీజ్ కావడంతో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది.

# పుష్పరాజ్ రియల్ ఐకానిక్ సూపర్‌హీరో: కింగ్ నాగార్జున



పుష్ప- పుష్ప 2 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దాదాపు 2100 కోట్ల గ్రాస్ వసూలు చేయడం ఒక సంచలనం. పుష్ప- పుష్ప 2 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దాదాపు 2100 కోట్ల గ్రాస్ వసూలు చేయడం ఒక సంచలనం. అయితే ఈ సంచలనానికి కారణమేమిటో ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తూనే ఉన్నారు. టాలీవుడ్ స్టార్ హీరో, నిర్మాత కింగ్ నాగార్జున పుష్ప ఫ్రాంఛైజీ విజయం వెనక అసలు కారణాలను విశ్లేషించారు. నాగార్జున తన వ్యూస్ ని షేర్ చేసారు. పుష్ప రాజ్ ఒక సూపర్ హీరో పాత్రగా.. ఐకానిక్ పాత్రగా మారాడని నాగ్ అన్నారు. దీని కారణంగా ఈ పాత్ర సోషల్ మీడియాలో గొప్ప ప్రజాదరణ పొందింది. పుష్ప రాజ్ సూపర్ హీరో పాత్రగా మారిపోయాడు. అతడు చాలా చాలా ఐకానిక్. మీమ్స్ లో, స్పూఫ్ లోను ప్రతిచోటా పుష్పరాజ్ ఒక ట్రెండ్ సెట్టర్. ఆ పాత్ర అంత గొప్ప స్థానాన్ని సంపాదించుకుంది. కాబట్టి కేవలం కథ ఇక్కడ ముఖ్యం కాలేదు.. ఒక పాత్రకు దక్కిన ఆదరణ ఇది అని నాగార్జున అన్నారు. ఏ సినిమా దేశవ్యాప్తంగా పంపిణీకి అర్హమైనది .. ఏది కాదు? అనేది అన్నపూర్ణ స్టూడియోస్ ఎలా నిర్ణయిస్తుంది? అని ప్రశ్నించగా, పుష్ప 2, ఆర్.ఆర్.ఆర్ గురించి నాగ్ ప్రస్తావించారు. కథ ప్రకారం సినిమా తీస్తాం. అది పుష్ప అయినా లేదా ఇటీవల విడుదలైన ఏదైనా సినిమాని తీసుకోండి.. స్థానికత గురించి ఆలోచిస్తాను. ఇక్కడ పుట్టి పెరిగిన డిఎన్.ఏ నుండి సినిమా వచ్చింది. కాబట్టి దర్శకులు కూడా అలాంటివారే. అయితే అది పూర్తిగా తెలుగు సినిమాగానే చేశారని నేను అనుకుంటున్నాను.. అందులో అజయ్ దేవగన్ నటించడం ఉత్తర భారతదేశంలో ఈ సినిమా బాగా ఆడటానికి మరో కారణం అని నాగ్ అన్నారు. తెలుగు మాట్లాడే ప్రేక్షకులు ఏ మంచి సినిమానైనా ఆదరిస్తారు. కాంతారా, లేదా మార్వెల్ సినిమా అయినా ఆదరిస్తారని నాగార్జున అన్నారు. అక్కినేని కుటుంబ యాజమాన్యంలోని చలనచిత్ర నిర్మాణ పంపిణీ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ 50వ వార్షికోత్సవం సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో నాగార్జున ఈ వ్యాఖ్యలు చేసారు.

# ప్రేమించిన వ్యక్తి నుంచి వేధింపులు ఎదుర్కొన్నా: ఐశ్వర్యా రాజేష్



రీసెంట్ గా సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో భాగ్యంగా మెప్పించిన ఐశ్వర్య రీసెంట్ గా తన వ్యక్తిగత జీవితం గురించి పలు విషయాలను వెల్లడించింది. ఐశ్వర్యా రాజేష్ సౌత్ సినీ ఇండస్ట్రీలో మంచి హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. తెలుగమ్మాయి అయిన ఐశ్వర్యా రాజేష్ కోలీవుడ్ కు వెళ్లి అక్కడ వరుస సినిమాలు చేస్తూ స్టార్ డమ్ ను అందుకుంది. రీసెంట్ గా సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో భాగ్యంగా మెప్పించిన ఐశ్వర్య రీసెంట్ గా తన వ్యక్తిగత జీవితం గురించి పలు విషయాలను వెల్లడించింది. చిన్న తనంలోనే తన తండ్రి చనిపోవడంతో అమ్మ ఒక్కరే తమ నలుగుర్ని ఎంతో కష్టపడి పెంచిందని, ఆ క్రమంలో ఆమె ఎన్నో ఇబ్బందులు పడిందని తెలిపింది. అమ్మ కష్టం చూసి ఆమెకు అండగా నిలబడాలని చిన్న వయసు నుంచే పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం మొదలుపెట్టిన ఐశ్వర్య క్రమంగా సినిమాల్లోకి వచ్చి అమ్మను చూసుకుంటున్నానని, ఆ విషయంలో తానెంతో గర్వంగా ఉన్నట్టు అమ్మడు తెలిపింది. లవ్ కంటే బ్రేకప్ అయినప్పుడు ఎక్కువ బాధ కలుగుతుందని, ఆ బాధ నుంచి బయటకు రావడం అంత ఈజీ కాదని, అందుకే దానికే ఎక్కువ టైమ్ తీసుకుంటానని చెప్పిన ఐశ్వర్య తాను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ఇష్టపడ్డానని, అతన్నుంచి ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నట్టు వెల్లడించింది. దాని కంటే ముందు కూడా తాను అలాంటి ప్రేమనే చూశానని, రిలేషన్‌షిప్‌లో ఎందుకిలా జరుగుతుందని ఎంతో భయపడినట్టు చెప్తున్న ఐశ్వర్య ప్రస్తుతానికి సింగిల్ గానే ఉన్నానని, గతంలో జరిగిన అనుభవాల వల్ల మళ్లీ ఎవరినైనా ప్రేమించాలంటే ఎన్నో ఆలోచనలొస్తున్నాయని ఐశ్వర్య తెలిపింది. తాను చాలా ఎమోషనల్ అని మళ్లీ మళ్లీ అంత బాధను తట్టుకునే శక్తి తనకు లేదని, ప్రస్తుతం సింగిల్ గా ఉన్నప్పటికీ ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపింది. ఇక కెరీర్ విషయానికొస్తే సంక్రాంతికి వస్తున్నాం హిట్ తర్వాత తనకు అవకాశాలు బాగానే వస్తున్నాయి.






జ్యోతిరావ్ క్యూట్ ఇన్ శారీ

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com